క్లుప్తంగా

లగడపాడులో స్వచ్ఛత హీ సేవ

పెదకూరపాడు: మండల పరిధిలోని లగడపాడు ఎంపీపీ స్కూలు ఆవరణలో సోమవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ లగడపాడు బ్రాంచి మేనేజర్ గంగాధర్ పాల్గొన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. స్కూల్ హెచ్ఎం వరలక్ష్మి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్, వరలక్ష్మి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామస్తులు విద్యార్థులు, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

3 నుంచి దేవీ నవరాత్రి మహోత్సవాలు

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో ఉన్న శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు శ్రీ దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు జరుగుతాయని ఆశ్రమ వంశ పారంపర్య ధర్మకర్త, మఠాధిపతులు చింతాడ లలితాంబ మాతాజీ సోమవారం తెలిపారు. అమ్మవారికి కుంకుమార్చన, కుమారి, సుహాసిని పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారికి రోజుకో అలంకారం చేపట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 3న శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి, 4న శ్రీ గాయత్రీ దేవి, 5న శ్రీ అన్నపూర్ణా దేవి, 6న లలిత త్రిపుర సుందరీ దేవి, 7న శ్రీ మహా చండీ దేవి, 8న శ్రీ మహాలక్ష్మీదేవి, 9న శ్రీ సరస్వతి దేవి 10న శ్రీ దుర్గాదేవి, 11న శ్రీ మహిషాసురమర్దిని దేవి, 12న శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా అలంకారం చేపట్టడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

సత్తెనపల్లి: మండలంలోని పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 9,932 మంది విద్యార్థులకు రెండో విడత 24,147 పాఠ్యపుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. 26వ వార్డు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి-1 ఎ.శ్రీనివాసరావు, ఎంఈఓ-2 ఏ రాఘవేంద్రరావు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఎన్ఎస్‌జేసీ డీఈగా మురళీధర్

సత్తెనపల్లి: నాగార్జునసాగర్ జవహర్ కెనాల్ ఆపరేషన్ అండ్ మెయింట్‌నెన్స్ సత్తెనపల్లి సబ్ డివిజన్ డీఈగా మురళీధర్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన గుంటూరు నుంచి సత్తెనపల్లికి బదిలీ అయ్యారు. ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. అలాగే సత్తెనపల్లి సెక్షన్-2 నుంచి ఏఈ సుందరావు ముప్పాళ్ళ సెక్షన్-1 కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కారంపూడి సెక్షన్ నుంచి ఏఈగా బత్తిన నరేంద్రబాబు సత్తెనపల్లి సెక్షన్-2కు వచ్చారు.

విఘ్నేశ్వరుని లడ్డూ ప్రసాదం పంపిణీ

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా స్వామివారి వద్ద పూజించిన లడ్డూ ప్రసాదాన్ని సోమవారం భక్తులకు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు గోపు అంజిరెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని రూ.25,116లకు వేలం పాటలో దక్కించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

క్రోసూరు: మండలంలో మంగళవారం నుంచి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపీడీఓ బి.మహేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8,638 మందికి గాను రూ.3,67,94.500లు నగదు విడుదలైనట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థి ఎంపిక



అమరావతి: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం పెనుమాక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అటలపోటీల్లో స్థానిక శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఎస్కే మొబిన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వంద మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. హెచ్ఎం మాజేటి రాము, వ్యాయమ ఉపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి


సత్తెనపల్లి: ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం గుంటూరు జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. చెడు వ్యసనాలకు అలవాటు పడిన రెంటపాళ్ళ గ్రామానికి చెందిన మర్రి చంద్రశేఖర్ (23) ఈ నెల 28న పురుగుమందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స నిమిత్తం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు అమర్తయ్య, వరకుమారి, ఓ సోదరి ఉన్నారు. మృతుడి తల్లి వరకుమారి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం వీధుల బోర్డులు

- తప్పులు తడకలను తక్షణమే సరిచేయండి
- వైఎస్సార్ సీపీ 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్
- ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం



కౌన్సిల్ అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్



చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ

సత్తెనపల్లి: పట్టణంలో వీధుల పేర్లు టౌన్ ప్లానింగ్‌లోని మాస్టర్ ప్లాన్ రిజిస్ట్రేషన్ ప్రకారం బోర్డులు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ఏర్పాటు చేసిన వీధుల బోర్డుల్లో 10 వరకు తప్పులు తడకలు ఉన్నాయన్నారు. తక్షణమే వాటిని మార్పు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ఇటీవల గ్రోమోర్ సెంటర్ అని బోర్డ్ ఏర్పాటు చేశామని, అక్కడ గ్రోమోర్ లేక పోవడంతో వచ్చిన ఫిర్యాదుల్లో భాగంగా దానిని తొలగించామన్నారు. గతంలో కొన్ని సెంటర్ల పేర్లు అయితే ఉండేవని, ప్రస్తుతం అవి లేనందున వాడుకలో ఉన్న పేర్లను పెట్టడం జరిగిందన్నారు. ఇంకా ఎక్కడైనా అభ్యంతరాలు ఉంటే తెలియచేసినట్లయితే సరి చేస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరావు నాయక్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు 52 విద్యుత్ స్తంభాలను వేశారని, కానీ వైరింగ్ పనులు జరగలేదన్నారు. వీటికి సంబంధించి పురపాలక సంఘం నుంచి నగదు కూడా చెల్లించడం జరిగిందన్నారు. మున్సిపల్ ఏఈ సాగర్ మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలకు వైరింగ్ చేపట్టేందుకు అవసరమైన కండక్టర్లు రావాల్సి ఉందన్నారు. వైరింగ్ కూడా కొంత తక్కువగా ఉండటం వల్లన ఆ పనులు జాప్యమయ్యాయన్నారు. అలాగే కుక్కల బెడదపై ప్రశ్నించగా.. మున్సిపల్ కమిషనర్ షమ్మి మాట్లాడుతూ కుక్కలను పట్టుకునేందుకు జంతు సంరక్షణ చట్టం నుంచి అభ్యంతరాలు ఉన్నాయన్నారు. కుక్కలకు స్టెరిలైజేషన్ తోపాటు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని, దీనికి ఏజెన్సీ ప్రతినిధులు రావాల్సి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ కుమార్ వెంగళరెడ్డినగర్‌కు రూ.1.10 కోట్లతో మంజూరైన ఓవర్‌హెడ్ ట్యాంక్ ఏ స్టేజ్‌లో ఉందని ప్రశ్నించారు. కమిషనర్ సమాధానమిస్తూ.. పట్టణానికి అమృత్ 2.0 కింద రూ. 29.1 కోట్లు మంజూరు అయ్యాయని, దీనిలో వెంగళరెడ్డి నగర్, పుతుంబాక వెంకటపతి కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు వస్తాయన్నారు. కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని శ్రీనివాస్ మహల్‌రోడ్ లో సెల్లార్ నిమిత్తం 15 అడుగులు భూమిలోకి తవ్వి గ్రావెల్ తీస్తున్నారని, దీనికి మైనింగ్, మున్సిపల్ అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. 11వ వార్డు వెంగళరెడ్డినగర్ నందు సర్వేనెంబర్ 104, 105, 106, 135, 136 నందు సీఆర్డీఏ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చుట్టూ ప్రహరీ, సిమెంట్ రోడ్లు నిర్మించి వెంచర్స్ వేసి ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్ చేసి విక్రయిస్తున్నారన్నారు. దీనివల్ల మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారని, దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. టీపీఎస్ కె.సునీత మాట్లాడుతూ తాను కొత్తగా వచ్చానని, పరిశీలిస్తానన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లా డుతూ ఈ రెండు అంశాలను పరిశీలిస్తామని సమాధానం ఇచ్చారు. 31వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తురక మేరీగ్రేస్ అజెండాలోని అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

■ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు విద్యార్థి ఎంపిక

అచ్చంపేట: అక్టోబర్ 3, 4, 5 తేదీలలో కృష్ణా జిల్లానున్న జిల్లా పరిషత్ హైస్కూలులో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 17 రెజ్లింగ్ (కుస్తీ) పోటీలకు తమ పాఠశాల విద్యార్థి వేమవరపు మహదేవ్ ఎంపికైనట్లు స్థానిక బ్లూ బెల్స్ హైస్కూలు హెచ్ఎం మేరీ శ్రీలత తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రైవేట్ పాఠశాలల నుంచి తమ విద్యార్థి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

■ నార్నెపాడు విద్యార్థుల ప్రతిభ

నార్నెపాడు(ముప్పాళ్ళ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో నార్నెపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ సోమవారం తెలిపారు. 200 మీటర్ల పరుగు పందెంలో ఎ.నీలవేణి, 400 మీటర్ల పరుగు పందెంలో సతీష్, జూనియర్ విభాగంలో గోపీచరణ్, డిస్కస్ త్రోలో పొన్నం శ్రీనివాస్, జస్వంత్ రెడ్డి, అండర్-14 విభాగంలో ఖో-ఖోలో దివ్యభారతి, విజయలక్ష్మి, శ్రావణి, చిన్నారి, జయశ్రీ ఎంపికయ్యారు. అండర్-14 బాలుర విభాగంలో గోపీచంద్, జస్వంత్‌రెడ్డి, అజయ్‌కుమార్, యోహాన్ జిల్లాకు ఎంపికయ్యారు. చెస్ సీనియర్ గర్ల్స్ విభాగంలో దుర్గభవాని, జూనియర్స్ బాలుర విభాగంలో పొన్నం శ్రీనివాసరావు జిల్లాకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

■ గులాబీ రంగు పురుగు ఉధృతిని గమనించాలి

సత్తెనపల్లి: పత్తి పంటలో గులాబీ రంగు కాయ తొలుచు పురుగు ఉధ్రుతి గమనించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ కీటక విభాగం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.మద్దిలేటి అన్నారు. మండలంలోని నందిగామ, గుడిపూడి, పెదమక్కెన, భీమవరం, పెదకూరపాడు మండలం లగడపాడు, పెదకూరపాడు గ్రామాల్లో పత్తి పంటలో గులాబి రంగు కాయ తొలుచు పురుగు నియంత్రణకు నాట్కో కంపెనీ నాటిమెట్ జెల్ ఉచితంగా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ, సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్ రెడ్డి, నాట్కో కంపెనీ రీజినల్ మేనేజర్ ప్రభాకర్ రైతులు పాల్గొన్నారు.

■ ఎక్సైజ్ సీఐ తులసీ బాధ్యతల స్వీకరణ



క్రోసూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.తులసి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. పదోన్నతిపై క్రోసూరు సర్కిల్‌కు వచ్చినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం, గుట్కా తదితర అక్రమ వ్యాపారాలను అరికట్టి ప్రభుత్వ మద్యం పాలసీని సమర్థంగా నిర్వహిస్తానని చెప్పారు. కొత్తగా వచ్చిన సీఐకి సిబ్బంది హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

■ నిష్పక్షపాతంగా సామాజిక తనిఖీ

అమరావతి: ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనులపై నిష్పక్షపాతంగా సామాజిక తనిఖీ నిర్వహించాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 17 విడత సామాజిక తనిఖీ కో-ఆర్డినేషన్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ శుభా అధ్యక్షత వహించారు. ఎంపీపీ హనుమంతరావు మాట్లాడుతూ మండలంలో జరిగిన పనులలో పారదర్శకత నిర్ధారించటానికే సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారన్నా రు. గ్రామ పంచాయతీ సిబ్బంది పూర్తిస్థాయిలో తనిఖీకి సహకరించాలన్నారు. ఎంపీడీఓ మాధవి, ఉపాధి హామీ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ, డీఆర్పీలు పాల్గొన్నారు.

■ విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

బెల్లంకొండ: కళాశాలకు వస్తున్న విద్యార్థులపై తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బత్తుల ఉమాదేవి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ ఆదేశాల మేరకు తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థుల నడవడికను నిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు. అనంతరం కళాశాలలోని సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో అధ్యాపకులు కవిత, శారదా దేవి, లక్ష్మీ సులోచన, వై రమేష్ బాబు , సాంబశివరావు, కుసుమకుమారి పాల్గొన్నారు.

■ 3నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

క్రోసూరు: ఈ నెల మూడవ తేదీ నుంచి క్రోసూరు వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి 45 వ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. 10 రోజుల పాటు అమ్మవారు పలు అవతారాలలో భక్తులకు దర్శనభాగ్యం కల్గిస్తారన్నారు. తొలిరోజు బాలత్రిపుర సుందరి దేవిగా, 4న గజలక్ష్మీదేవీగా, 5న గాయత్రీదేవీ, 6న లలిత త్రిపురసుందరీదేవీ, 7న అన్నపూర్ణదేవీగా, 8న ధనలక్ష్మీగా, 9న సరస్వతీ దేవీగా, 10న దుర్గామాతగా భక్తులకు దర్శభాగ్యం కల్గింస్తుందన్నారు. భక్తులు అశేషంగా పాల్గొని ఆమ్మవారి ఆశిస్సులు పొందాలని కోరారు.

■ అనుమతులకు విరుద్ధంగా వెంచర్లు

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని 11వ వార్డు వెంగళరెడ్డి నగర్‌లో అనుమతులకు విరుద్ధంగా వెంచర్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్‌కుమార్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని వెంగళరెడ్డి నగర్ నందు సర్వే నెంబర్ 104, 105, 106, 135, 136 లో సీఆర్‌డీఏ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చుట్టూ ప్రహరీ, సిమెంట్ రోడ్లు నిర్మించి వెంచర్లు వేసి ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేసి విక్రయిస్తున్నార న్నారు. దీని వల్ల మున్సిపాలిటీ వారికి రావలసిన ఆదాయానికి గండి పడుతుందన్నారు. అమాయక ప్రజలను మోసం చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారన్నారు. సంబంధిత అధికారుల ద్వారా విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

■ నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

సత్తెనపల్లి: దళిత యువకులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు వట్టపు మరియదాసు, గార్లపాటి దాసు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధిత క్షతగాత్రులను సోమవారం పరామర్శించి మాట్లాడారు. రాజుపాలెం మండలం బలిజేపల్లి గ్రామానికి చెందన మాదిగ యువకులైన మరియదాసు, మరికొంత మందిపై అగ్రవర్ణాలకు చెందిన భూస్వాములు దాడి చేయడమే కాకుండా ఒక గదిలో బంధించి గంటల తరబడి దాడి చేశారన్నారు. తక్షణమే వారిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

■ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్ సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన ఉపాధి హామీ పనులపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పనుల ఎంపికపై అక్టోబర్ 2న గ్రామ సభలు నిర్వహించి, వేసవిలో పనులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈవోపీఆర్డీ వీర్రాజు, ఏపీఎం నాగశ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి పథకంలో 78 రకాల పనులున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

■ గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్ డాక్టర్లను నియమించాలి

పెదకూరపాడు : పెదకూరపాడు లోని కమ్యూనిటీ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్ వైద్యులను వెంటనే నియమించాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సంఘం పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, గ్రామస్తులు, రైతులతో కలిసి తహసిల్దార్ దానియేలుకు వినతి పత్రం సోమవారం ఇచ్చారు. దర్శి శేషారావు మాట్లాడుతూ పెదకూరపాడులో నూతనంగా ఆసుపత్రి నిర్మించటం మంచి పరిణామమన్నారు. కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ వైద్యులు సుమారు 11 నెలలుగా అందుబాటులో లేన్నారు. ఏడు నెలల నుంచి జనరల్ సర్జన్ వైద్యులు లేరన్నారు. కార్యక్రమంలో కె.ప్రసాదు, షేక్ ఇమ్రాన్, ఎం మస్తానావు, సిహెచ్ శివాజీ, షేక్ షబ్బీర్, ఎం హరిబాబు, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

■ మతం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామం నుంచి పాపాయపాలెం వెళ్లే మతం రోడ్డుకు తారురోడ్డు నిర్మాణానికి సోమవారం మండల కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఇచ్చిన హామీ మేరకు రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ1.50 కోట్ల వ్యయంతో రహదారి నిర్మాణం జరగనుంది. గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలు తీర్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే ప్రవీణ్ పనిచేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, ఆసుల జగన్, గడిపర్తి జ్యోతి సముద్రం, అక్కల వెంకట్రామిరెడ్డి, గుంజ గంగారావు, ఒర్సు ఆనంద్, తమ్మిశెట్టి సత్యనారాయణ, చెరుకుపల్లి శ్రీను, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

■ దేశాభివృద్ధిలో ముందుండాలి

పెదకూరపాడు: మహాత్మా గాంధీ కలలగన్న దేశాభివృద్ధి లక్ష్యసాధనలో అందరూ కలిసికట్టుగా ముందుండాలని పెదకూరపాడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కాకాని వెంకటరమణ అన్నారు. సోమవారం ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సౌజన్యంతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛత హీ సేవ, స్వచ్ఛత సంస్కారం, స్వభావ స్వచ్ఛతపై జరిగిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రశంస పత్రాలు, ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. గ్రామం వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

■ ప్రతి ఒక్కరికి వందరోజుల ఉపాధి కల్పించాలి

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికి వందరోజుల ఉపాధి పని కల్పించాలని ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనుల గుర్తింపు ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు, వివిధ శాఖల సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాలలో చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 2న ప్రతి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి, పనులను గుర్తించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి, ఎంపిక చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డి బి వెంకటరెడ్డి, ఏపీవో కోటమ్మ, టీఏ చిరంజీవి నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

■ జిల్లాస్థాయి డిబేట్‌లో విద్యార్థిని ప్రతిభ

సత్తెనపల్లి: జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర విజన్-2047 కు సంబంధించి సోమవారం నిర్వహించిన డిబేటింగ్ పోటీల్లో సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.నాగరూప జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. సోమవారం ప్రతిభ చూపిన నాగరూపను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఎ.శ్రీనివాసరావు, ఎ.రాఘవేంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదా దేవి ఉన్నారు.

■ సాగులో మెళకువలపై రైతులకు శిక్షణ

నకరికల్లు: ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం చేపడితే గణనీయమైన పంట దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. రూపెనగుంట్ల గ్రామంలోని రైతులకు సాగులో మెళకువలను సోమవారం వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగు మందులను అవసరానికి మించి వాడకూడదన్నారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ మండలంలోని 76 శాతం మంది రైతులు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేవైసీ పూర్తిచేసుకున్న రైతులకు వ్యవసాయ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రైతు సేవ కేంద్రాల్లో యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ ప్రవీణ్, ఎంపీఓ హనుమంతరావు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు సత్కారం



డీఈ మధుసూదన్‌రావు, జేఏఓ అనురాధను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మీతులసీ

సత్తెనపల్లి: పట్టణంలోని పురపాలక సంఘంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులకు సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగుల ఆధ్వర్యంలో సత్కారం నిర్వహించారు. సత్తెనపల్లి మున్సిపల్ డీఈగా పని చేస్తున్న బి.మధుసూదన్‌రావు గుంటూరు కార్పొరేషన్‌కు, జూనియర్ అకౌంటెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న చల్లా అనురాధ గూడూరు పురపాలక సంఘానికి బదిలీ అయ్యారు. వారికి వీడ్కోలు పలుకుతూ సత్కారం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రజల నుంచి ఎల్లప్పుడు ఆదరాభిమానాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఫ్లోర్ లీడర్ తురక మేరీగ్రేస్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు ఉన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరం

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం సత్తెనపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియాన్‌లో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆహారంపైన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని, పౌష్టికాహారం దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షిస్తుందన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. ముందుగా గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. సీడీపీఓ టి.శ్రీలత, ఏసీడీపీవో టి.సంతోషకుమారి, సూపర్ వైజర్లు ప్రమీల, అరుణ, ఆషా, అనంతలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

సత్తెనపల్లి: క్షణికావేశంలో చేసిన తప్పులు సరిద్దిదుకుని, భవిష్యత్‌లో సత్ప్రవర్తనతో మెలగాలని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), మండల న్యాయసేవాధికర కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సబ్ జైలును సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ముందుగా పరిసరాలను అన్నిటిని గమనించారు. అక్కడ ఉన్న రిమాండ్ నిందితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి హక్కులను గురించి తెలియజేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకొనే స్తోమత లేనివారికి ప్రభుత్వ న్యాయ సహాయ న్యాయవాదిని నియమించి, ఉచిత న్యాయ సేవలు అందించబడతాయన్నారు. బియ్యం, నిత్యావసర సరుకుల నాణ్యతను న్యాయమూర్తులు పరిశీలించారు. న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, సబ్‌జైలు సూపరిండెంట్ టి.వెంకటరత్నం ఉన్నారు.

శంకరరావుకు సేవారత్న అవార్డు



అవార్డు అందుకున్న చైర్మన్ గరికపాటి శంకరరావు

రాజుపాలెం: కొండమోడు సమీపంలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ రూరల్ డెవెలెప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధుల అనాథల ఆశ్రమ నిర్వాహకుడు గరికపాటి శంకరరావుకు మదర్ థెరీసా జాతీయ సేవా రత్న అవార్డును సోమవారం అందజేశారు. రాష్ట్ర మార్షల్ డీఎస్పీ వి.గణేష్‌బాబు అమ్మవాడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అల్లాడి శ్రీనివాసరావు, ఎస్సీ ఆర్. విఠల్‌కుమార్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎస్‌సీఎల్‌పీ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మార్కులు శాలువా కప్పి, సత్కరించి సేవా రత్న పథకాన్ని, షీల్డ్‌ను అందజేశారు. వృద్ధులు, అనాథ పిల్లల ఆశ్రమం నడుపుతున్న గరికపాటి శంకరరావును అభినందించారు. ఏపీ హైకోర్టు న్యాయవాది బోయ మద్దిలేటి, జీఎస్టీ కమిషనర్ పి.శేషగిరి పాల్గొన్నారు.

భూసారాన్ని బట్టే ఎరువులు వాడాలి

జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శివకుమారి



శిక్షణలో మాట్లాడుతున్న ఎం.శివకుమారి

రాజుపాలెం: భూసార ఫలితాను బట్టి ఎరువుల పంటకు వాడాలని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.శివకుమారి తెలిపారు. ఇనిమెట్ల గ్రామంలో మండల వ్యవసాయాధికారి పి.వెంకటనరసయ్య అధ్యక్షతన రైతులకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ భాస్వరం ఎరువులను వరి నాటు సమయంలోనే వాడాలని తెలిపారు. క్రోసూరు ఏడీఏ వి.హనుమంతరావు మాట్లాడుతూ వరి పైరుకు 60 రోజుల వరకు బురద పదునుతో ఉంచితే వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో ప్రవీణ్ మాట్లాడుతూ విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వాడకుండా పర్యావరణాన్ని కాపాడాలని, సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలని తెలిపారు. వీఏఏ సీహెచ్ రూప, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో పారిశుద్ధ్యం

పెదకూరపాడు: మండలపరిధిలోని లగడపాడు ఎంపీపీ స్కూలు ఆవరణలో సోమవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ లగడపాడు బ్రాంచి మేనేజర్ గంగాధర్ పాల్గొన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వరలక్ష్మీ, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ మొక్కలు నాటారు.

5న దుకాణాలకు బహిరంగ వేలం

అమరావతి: గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్, కూరగాయల మార్కెట్‌లోని షాపులకు ఈ నెల 5న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి పీఎస్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని, అసక్తి గలవారు రూ.5 వేలు దరావతు చెల్లించాలన్నారు. నెలవారీ అద్దె విధానంలో దుకాణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రూ.5 లక్షల విరాళం

పెదకూరపాడు: మాజీ ఎంపీపీ నెలకుదుటి వరప్రసాద్ మిత్రమండలి రూ. 5 లక్షల చెక్కును అన్న క్యాంటీన్ నిర్వహణకు సోమవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మిత్ర మండలికి కృతజ్ఞతలు తెలిపారు.